# వాన

గ్రీకిన పండులా ఎర్రగామండుతున్నాడు దిగిపోతూన్నసూర్యుడు. అస్తమయ సూర్యుని కిరణాలు ఆ ప్రదేశాన్ని ఎర్రగా రక్తమయం చేస్తున్నాయి. పగలంతా రోడ్డుమీద దుమ్ము ఊడ్చుకొంటూ ఉన్మాదిలా తిరిగిన గాలి కొద్దిగా నిమ్మళించింది.

దారి కిరుపక్కలా వేపచెట్లు. పక్కన అక్కడక్కడ రావిచెట్లు. వడగాలికి వాడిపోయి ముఖాలు వేలాడవేసుకొన్నాయి. మైదానంలో ఉన్న గడ్డి ఎండిపోయి ఎర్రనేల దుమ్ము లేస్తూంది. నిర్జీవంగా ఉన్న ఆ చెట్ల మధ్య ఆస్పత్రి భవనాలు రోడ్డుమీదకు కనుపిస్తున్నాయి.

గేటు దాటి ఒక అడుగు ఆ ఆవరణలో పెట్టాను.

ఆరునెలల తరవాత నా మిత్రుణ్ని చూస్తున్నందుకు శరీరం ఆనందంతో తేలిపో సాగింది. పెద్ద పెద్ద అంగలు వేస్తూ లోనికి వెళ్ళాను. ఫస్టు క్లాస్ వార్డు వెదుకుతూ వరండాలన్నీ చుట్టివేయసాగాను. తిరుగుతూ తిరుగుతూ ఒక గది ముందు ఆగిపోయాను.

గాలీ, వెలుతురూ నిరాటంకంగా వస్తున్న గది. లోపల వైపు గోడలకు లేత పసుపు పచ్చని రంగు పూయబడి ఉంది. గది మధ్యలో మంచం. మంచంపై ఎత్తయిన పరుపు. పరుపుపై శుభ్రమైన తెల్ల దుప్పటి పరిచి ఉంది. దుప్పటిపైన థామస్ హార్డీ నవల. మంచం పక్కన చిన్న టేబిల్, దాని పక్కన కుర్చీ. కుర్చీ చేతిమీద కూర్చుని ముందుకు వంగి కిటికీలోనుండి చూస్తున్నాడు అతను. ముఖాన్ని రెండు చేతుల మధ్య పెట్టుకొని; అటు తిరిగి సూర్యాస్తమయాన్ని చూస్తున్నాడు.

"సంజీవరావ్!" పిలిచాను.

అతను వెనుదిరిగి చూడలేదు.

"సంజీవరావ్!" కొద్దిగా బిగ్గరగా పిలిచాను. అతను వెనుతిరిగి చూసి కనుబొమలు పైకెత్తుకొని, "హల్లో" అని గట్టిగా కేకవేసి ముందుకు కదిలాడు. గట్టిగా కౌగలించుకొని అప్యాయంగా లోనికి తీసుకు వెళ్ళాడు.

"కూర్చోరా! ఏమిటి విశేషాలు? నేను మధ్యాహ్నం నుండి ఎంత ఎదురు చూస్తున్నానో తెలుసా? నేను చెప్పలేను. కావాలంటే మా అమ్మ నడుగు ఇంకా. అందరూ క్షేమమేనా?"

ఔనన్నట్లు, తల ఊపాను. నేను ఊహించినదానికి విరుద్ధంగా ఉండటంవల్ల అతని ప్రవర్తన కొద్దిసేపు అలా చూస్తూ ఉండిపోయాను.

"ఏమిటిరా. అలా చూస్తావ్? నేనంత వింతగా ఉన్నానా?"

తన మాటలలో విపరీతమైన ధోరణి కానీ, ప్రవర్తనలో అసహజమైన చేష్టలు కానీ లేకపోవటం వల్ల నన్ను నేనే నమ్మలేక పోయాను.

"అది కాదురా. ఆరు నెలల తరవాత చూస్తున్నాను గదా? అందుకు."

"ఇక చెప్పరా! అబ్బబ్బ ఈ జైలునుండి ఎప్పుడు విడుదల చేస్తారో ఏమిటోగాని చచ్చిపోతున్నానంటే నమ్మరా! ... ఒక ఫ్రెండ్ లేడు. ఒక హాబీలేదు సరే, ఇక ఈ పుస్తకాలు కూడా లేకపోతే పిచ్చెత్తిపోవును" అని బిగ్గరగా నవ్వి నా చెయ్యి ప్రేమతో స్పృశించాడు. ఆ చివరి మాట విని నేను కొద్దిగా చలించాను.

"ఇక నీకు ఫ్రెండ్స్‌కేం కొదవరా! నేనిక్కడే ఉంటాను. ఇక ఆ రెండు జడల నళిని, ప్రసాద్, రవిబాబు, మన నాటకాలరాయుడు, ఇంకా మన ముఠాలో చాలామంది ఈ యూనివర్సిటీలో చేరబోతున్నారు. నీ కిక బోలెడంత కంపెనీ...తెలిసిందా?"

నా మాటలు అతని ముఖంలో కొత్త వెలుగు కలిగించాయి.

"నీవుకూడా ఈ సంవత్సరం ఇక్కడే చేరుదువుగానిలే. అందరమూ గ్రాండ్‌గా రెండు సంవత్సరాలు గడుపుదాం. ఈ యూనివర్సిటీలో చేరటంలో మా ఉద్దేశం సగం నిన్ను చూడటానికి వీలుగా ఉంటుందనే."

"అయితే మనందరమూ ఒకేచోట ఉంటామన్న మాట." చిన్న పిల్లవాడిలా సంబర పడిపోయాడతను.

పొద్దు గర్భాన పడి సంధ్యకాంతులు అలుముకోసాగాయి. దూర దూర తీరాలన్నీ నల్లరంగులో కలిసిపోతున్నాయి. గదిలో లైటు వెలిగింది.

"ఇక్కడ ఎలా ఉందిరా?"

"ఇక్కడా?.. చాలా బాగుంది ... ఇక్కడ ఇరుకైన సందులూ గొందులూలేవు. దుమ్ము ధూళి నెత్తినపోసే మోటార్లు లేవు. దుర్గంధం వెద జల్లే మురుగు కాలవలు లేవు. హోటళ్ళు లేవు. వాటిముందు అడుక్కుతినే బిచ్చగాళ్ళు, వాటి పక్కన ఎంగిలాకులు ఏరుకు తినే మానవులు అంత కన్నా లేరు. చక్కని గాలీ, వెలుతురూ...సూర్యోదయం, అస్తమయం. ఎంతో హాయిగా ఉన్నాయి" అని మళ్ళీ కిటికీ కేసి తిరిగాడు.

వెర్రితలలు వేస్తూన్న నాగరికతపై తను లోగడ చేసిన గంభీర ఉపన్యాసాలు, వ్యాఖ్యలు నాకు స్ఫురించాయి. అతని స్వాభావికమైన ధోరణి విని సంతోషించాను.

"ఇక్కడ సంగతులకేం గానీ...అక్కడ సంగతులు చెప్పరా.., ఓవర్ బ్రిడ్జి ప్రారంభోత్సవ మయిందా!" నన్ను ప్రశ్నించాడు.

"ఔను.. ఎప్పుడో అయిపోయింది...దాని పక్కన ఫ్లోరోసెంటు దీపాల తోరణాలు...ఎంతో అందంగా హుందాగా ఉంది."

"అందం గిందం...ముఖ్యవిషయ మేమంటే అక్కడ గుంట గ్రౌండ్స్‌కు ఇవతల రైలుపేటలో ఒక పెద్ద సత్రం ఉండేది మెయిన్

రోడ్డుమీద. అది రెండంతస్తుల దెయ్యాల కొంప. దానిలో ఎప్పుడూ కొంపా గోడూ లేని నిర్భాగ్యులు...కుంటి గుడ్డి రోగిష్టులు, బైరాగులు, ఫకీర్లు నానాజాతులు అందులో పడి ఉండేవాళ్ళు. పగలంతా అడుక్కొని రాత్రికి శరీరాలను అక్కడికి ఈడ్చుకువచ్చేవాళ్ళు ... అది చీకటితో, గోనె పట్టాలతో, చాపలతో అసహ్యంగా ఉండేది పొగ గొట్టుకుని. అప్పుడు నే ననుకునేవాణ్ని—ఈ బిల్డింగు బాగుచేసి కొట్లు కట్టించి అద్దెల కిస్తే వీళ్ళకు ఆశ్రయ మెక్కడా అని." చీకటిలోకి చూస్తూ అటు వైపు తిరిగి మాట్లాడసాగాడు ఆగి ఆగి. గోడపై వాడి ఆకారం నల్లగా పడి, ఆవహించబోనున్న దయ్యంలా పెదవులు కదల్చసాగింది.

"ఆ బిల్డింగు నిజంగానే కొట్లయిపోయింది. వాళ్ళందరూ కొత్తగా కట్టిన ఓవర్ బ్రిడ్జి క్రిందికి మకాం ఎత్తివేశారు ... ఇప్పుడు వాళ్ళని అక్కడ ఉండనిచ్చారా?...వెళ్ళగొట్టారా? మొత్తానికి ఆ ఓవర్ బ్రిడ్జివల్ల, దాదాపు ఓ వెయ్యిమంది దౌర్భాగ్యులకు ఆశ్రయం దొరికింది."

మామూలుగా అతని సునిశిత హృదయంలో చెలరేగే నైరాశ్యపు భావాలు దిక్కులేని వాళ్ళను, అనాథలను, అసహాయులను గూర్చి దుఃఖ పడే ప్రవృత్తి గమనించి స్తబ్ధంగా ఉండిపోయాను.

అంతలో అడుగుల చప్పుడు వినిపించింది. ఆ పాదాలను నిరీక్షిస్తూ అటు తిరిగాము ఇద్దరమూ. ఫ్లాస్కు జాగ్రత్తగా చంకలో పెట్టుకొని, ఒక చేత్తో టిఫిన్ కారియర్ పుచ్చుకొని వాళ్ళ అమ్మ ప్రవేశించింది.

సన్నగా కృశించిపోయి ముందుకు వంగిన మెడ. దిగులుతో లోతుకు పీక్కుపోయిన కళ్ళు. ఆరునెలల కాలంలోనే సగం తెల్లబడిన తల.

నేను లేచి మంచం దిగి నమస్కరించాను. ఆమె ప్రతి నమస్కారం చేసింది. కానీ, నన్ను గుర్తించలేక అలా కళ్ళు అప్పగించి చూడ సాగింది.

"అమ్మా, నీవింకా గుర్తించలేదే? మూర్తిగాడు ... పేరమ్మగా

రబ్బాయి. నీవు గుడ్డిదానవయిపోయావే, అమ్మా" అని బిగ్గరగా నవ్వి బయటికి వెళ్ళాడు తను.

"అయ్యో...నాయనా...నీవా? ... నా మతిమరుపు మండా! ... అమ్మా వాళ్ళందరూ బాగున్నారా. నాయనా ... ఎన్నాళ్ళకు కనిపించావయ్యా!...పరీక్షలు అయిపోయాయా? మీ అందరూ అ స్తమానం మా పంచలో కూర్చుని నవ్వుతూ ఆడుతుండేవాళ్ళు ... మరి ... మా ఖర్మ, నాయనా ... ఇదెక్కడి రోగమో ... ? వెంటబడింది" ఆమె కన్నీళ్ళు ఒత్తుకుంది.

"అంతా నయమయి పోయినట్లేనమ్మా ... నే నిప్పటివరకూ మాట్లాడాను. పిచ్చితరహా నా కేమీ కనిపించలేదు. అన్నీ మామూలు మనిషిలానే మాట్లాడాడు. ఒక నెలలో డిస్చార్జి చెయ్యవచ్చు ... ఇదివరకులా మాటిమాటికీ స్పృహతప్పిపోవడం, ఆ అపస్మారక స్థితిలో భయంకరంగా అరవటం, కేకలు వెయ్యటం, నిద్రలో ఉలిక్కిపడి లేచి వెర్రి చూపులు చూడడం, చేతివేళ్ళు పరిశీలించుకోవడం – అవన్నీ దాదాపు తగ్గిపోయాయనుకొంటా," ఆమెకు తన పుత్రుని ఆరోగ్యం కోలుకొంటుందనే విశ్వాసం కలిగించడంకోసం ప్రయత్నించాను.

"ఔను, నాయనా ... నాకు అలానే అనిపిస్తోంది ... కానీ, వాన కురిసిన రోజున ఎవరో వాడివెంటబడుతున్నట్లు వెనక్కి తిరిగి భయం భయంగా చూచుకోవటం, తిండి తిప్పలు మానేసి అ స్తమానం కిటికీలో నుండి చూడటం తగ్గలేదు. నయమై వాడు మనలో ఒకడై తిరుగుతాడో లేదో," ఆమె ముక్కు చీదుకొని మరొకసారి కళ్ళు ఒత్తుకొంది.

పెద్దగా ఈలపాట పాడుకొంటూ తను తిరిగి వచ్చేశాడు. వచ్చీ రావటంతోనే టిఫిన్ కారియర్ గిన్నెలన్నీ ఊడదీసి బల్లపై పరచాడు.

"అమ్మా...వాడికి నీవు మళ్ళీ ఏం వంట చేస్తావులే మే మిద్దరమూ ఇందులో సరిపెట్టుకొంటాం .... ఏరా ... ఒకపూట తక్కువ తింటే చావంగదా!" అని కొంటెగా వాలుకన్నులతో చూసి కన్ను కొట్టాడు.

ఆ అస్వాభావిక చేష్టవలన నాకు కొద్దిగా భయం గలిగింది.

"ఎందుకురా ! ఒక గిద్దెడు బియ్యం పొంగించే దానికి...ఎంతసేపు" అంటూ ఆమె త్వర త్వరగా వరండా వేపు నడిచి వెళ్ళింది.

తను రెండు ప్లేట్లు టేబిల్‌పై పెట్టి, ఒరేయ్ ... నీ వా కుర్చీలో కూర్చుని తిను. నేను ఈ మంచంపై కూర్చుంటా" అంటూ మంచం బల్ల దగ్గిరికి లాగాడు. తన్ను జాగ్రత్తగా పరిశీలిస్తూ తను చెప్పినవాటిని అమలులో పెట్టసాగాను.

ఇద్దరమూ భోజనానికి ఉపక్రమించాం. ఓ నిముష మయ్యాక నన్నడిగాడు! "ఒరేయ్, మన హోటల్ ఎలా ఉంది? నేను వచ్చాక మానేశావా ?"

"ఏ హోటలూ ? ఓహో, అదా !"

మే మిద్దరమూ గత సంవత్సరం ఒక మధ్యరకం హోటల్‌లో నెలసరి భోజనాలు చేస్తూండేవాళ్ళం. అది అశుభ్రంగా అసహ్యంగా ఉండడంవల్ల రద్దీ చాల తక్కువగా ఉండేది. గొప్పవాళ్ళ మనుకునేవారు ఆ చాయలకు రారు. ఆ హోటల్ వెనక గది ఎప్పుడూ ఏకాంతంగా ఉండేది. ఆ టేబిల్ చలవరాతిపై కాళ్ళు పడవేసి చదువుకొంటూనే, ఆలోచిస్తూనే కాలం గడుపుతూండే వాడు తను. ఒక్కక్షణం హోటల్ నాకళ్ళ ముందు మెరిసి మాయమైంది.

"ఆ హోటలు ముందు ఇద్దరు కుష్ఠువాళ్ళు. వాళ్ళ పిల్లవాడు అడుక్కుతినేవాళ్ళు...జ్ఞాపకం ఉందా?" తను అన్నం కలుపుకోవటం మానేసి నాకేసి చూస్తూ అడిగాడు.

"జ్ఞాపకం లేకపోవటమేం! నీ భక్తులు ... నీ వెప్పుడూ వాళ్ళకు డబ్బు లిస్తూండేవాడివి...అయితే వాళ్ళిప్పుడు లేరు...నీవు ఉన్నప్పుడే చచ్చిపోయారు కదూ?"

"అవును...పాపం. దారుణమైన చావు చచ్చిపోయారు ఆ సత్రం ముందు" అన్నాడు. నేను కుర్చీ వెనక్కు వాలిపోయి తనకేసి ఆశ్చ

ర్యంతో చూశాను. నానుండి తన చూపులు తిప్పుకున్నాడు. అతని కళ్ళ ముందు ప్రత్యక్షమైన ఆ హృదయ విదారక దృశ్యం వికృతమై, భయం కొలిపే ఆ చావులు నా కళ్ళలో మెదిలాయి.

ఒక క్షణం మౌనం వహించి అతను పలికాడు. 'పాపం వాళ్ళు దిక్కు లేనివాళ్ళు. వాళ్ళ చావుబ్రతుకులను గూర్చి పట్టించుకొనేవాళ్ళు లేరు ... ఇంటిముందు వచ్చిన కుక్కను కాలికి తాడుగట్టి ఊరు బయటికి ఈడ్చుకు వెళ్ళినట్లు ఆ అభాగ్యులను మునిసిపాలిటీవాళ్ళు చాపల్లో చుట్టి చెత్తలారీలలో ఈడ్చుకు వెళ్ళి ఏ గుంటలోనో పడవేసి ఉంటారు కదూ? అదే మామూలు మనుషులయితే పోస్టుమార్టెం చెయ్యటం, పోలీసు దర్యాప్తు చెయ్యటం, అనుమానితులను అరెస్టు చెయ్యటం - ఎన్నో తతంగాలు." అతని కంఠం నీరసించిపోసాగింది.

ఆకాశంలో మంటలు లేస్తున్నట్లు ఇంకా వడగాలి మెల్ల మెల్లిగా వీస్తూనే ఉంది. నీలంరంగు ఆకాశంపై చుక్కలు మిణుకు మిణుకు మనసాగాయి. గది బయట చల్లని చీకటి పొంచి ఉంది. గదిలో వేలాడుతున్న దీపం గాలికి మెల్లిగా ఊగిసలాడసాగింది. గోడమీద అతని నీడ అతనికి వెంటాడుతూ నల్లగా వ్యాపిస్తుంది.

తను గ్లాసు పైకెత్తి మంచినీళ్ళు తాగి మళ్ళీ అన్నాడు: "కానీ వాళ్ళు ఆ విధంగా చనిపోవటంవల్ల వాళ్ళకి నికృష్టమైన బ్రతునుండి శాశ్వతమైన విముక్తి దొరికింది? ఏమంటావ్?" తిరిగి అన్నం కలుపుకొంటూ అన్నాడు.

"అవును ... మృత్యువువల్ల వాళ్ళకు ఎంతో మేలు కలిగింది."

నా సమాధానంతో తన ముఖం ఆనందంతో విప్పారింది. అయితే రెండవ క్షణంలోనే ముఖంపై నీలి నీడలు ఆవరించాయి. వెంటనే సంబాళించుకొని విశ్వాసపూరితమైన దృక్కులతో నాకేసి తిరిగి ప్రశ్నించాడు:

"ఆ మృత్యువు మీరందరూ నెత్తిన పెట్టుకొని ఊరేగే ఆ దేవుడు

ప్రసాదించిన సహజమైన మృత్యువు కాకుండా ఎవరో విషమిచ్చి చంపటం వల్ల సంభవిస్తే ఆ హంతకుణ్ణి నీవు హంతకుడని పిలుస్తావా ?...లేక దేవుడైన మానవుడంటావా ?"

గదిలో దీపం ఊగటం ఆగిపోయింది. గాలి స్తంభించిపోయి విపరీతంగా ఉక్కపోయ నారంభించింది. శరీరమంతా చెమటలు పోశాయి.

"అలా చూస్తావేమిట్రా పిచ్చివాడిలా...లాజికల్‌గా ఆలోచించు ...అనవసరంగా వేదాంతం మాట్లాడకు...ఒక్క మాటలో సమాధానం చెప్పాలి."

"దేవుడనే అనాలి." తడబడుతున్న కంఠాన్ని అదుపులోకి తీసుకొంటూ అన్నాను.

"నీవలా చూడకురా నాకేసి...తంతాను. అలా ఎందుకు జరిగి ఉండకూడదని అన్నాను, అంతే. అయితే ఆ హంతకుడు ఘోరపాతకం చేసినట్లు క్రుంగిపోవలసిన పనిలేదు. అంతేనా ?" మళ్ళీ అన్నాడు నా కళ్ళలోకి చూస్తూ.

ఔనన్నట్లు తల ఊపి తినటంలో నిమగ్నమైపోయాను ఓ నిముషం. మళ్ళీ అతనికేసి చూశాను. అతని ముఖం భావరహితంగా ప్రశాంతంగా ఉంది, కొద్ది క్షణాలు గడిచాక అతని పెదవులు అన్నం తింటూనే వణుకుతున్నాయి.

"అంతా మనపిచ్చి ... ఏదైనా మన మనస్సుపై ఆధారపడి ఉంటుంది." అంతలో వాళ్ళ అమ్మ నాకోసం భోజనం సిద్ధంచేసి తీసుకు వచ్చింది. నేను అప్పటికే మజ్జిగ వేసుకోవటంవల్ల తనే రెండవ కారియర్ ఖాళీ చేశాడు. పిచ్చితిండి తిన్నాడు. ఎంగిలి గిన్నెలు పుచ్చుకొని ఆమె బయటికి నడిచింది.

తువ్వాలతో చేతులు తుడుచుకొంటూ చిరునవ్వుతో నాకేసి తిరిగి అన్నాడు : "ఏరా, మన ప్రిన్సిపల్ ఏమంటున్నాడు ? నన్నింకా సెంటిమెంటల్ ఫెలో అంటున్నాడా" అని బిగ్గరగా నవ్వాడు. వరండాలోనుండి

గడియారం ఏడు వినిపించింది. నందివర్ధనం పువ్వులా ఉన్న మళయాళీ నర్సు ఒకామె వచ్చింది.

"హలో, గుడ్ ఈవెనింగ్ కుట్టి" అని తను స్వాగతం పలికాడు.

"గుడ్ ఈవెనింగ్...నైస్ కంపెనీ టుడే ఫర్ యు" అని అభినందించి ఔన్సు గ్లాసు అందించింది. ఆ నర్సుకేసి చూస్తూ రెండు గుటకల్లో మందు తాగివేశాడు.

ఆమె వెళ్ళిపోయింది. పక్కనున్న ఇంగ్లీసు నవల చేత్తో పట్టుకొని వెల్లకిలా పడుకొని చదవనారంభించాడు. అయిదు నిమిషాలలో పుస్తకం బోర్లాపడింది అతని ఛాతీమీద. కనురెప్పలు వాలిపోయాయి. నవల తీసి టేబుల్‌పై పెట్టాను.

అప్పటివరకూ సమ్మె చేసిన గాలి మళ్ళీ కదిలింది. చల్లని వాన గాలులు వీవనారంభించాయి. కిటికీలోనుండి బయటకు తొంగిచూశాను.

చుక్కలన్నీ చెప్పకుండా పారిపోయాయి. చల్లని మేఘాలు ఒక దానితో ఒకటి ఢీకొంటున్నాయి. ఆ మూలనుండి ఈ మూలవరకు ఆకాశాన్ని చీలుస్తున్నాయి మెరుపులు. ఒక్కొక్క చినుకు పైనుండి తెగి పడసాగింది. ఆ నిశ్శబ్దంలో సన్నని రోదన వినిపించి పక్కకు తిరిగాను.

"నాయనా! వాన పడుతూంది. మళ్ళీ కలివరింతలు, పిచ్చికేకలు మొదలెడతాడేమో భయంగా ఉంది,"

"ఇంతలో లేవడు...మందుపోసి పోయింది నర్సు. పగలంతా బాగా ఎండ కాయటాన నాలుగు చినుకులు పడతాయి. అంతే ... నీవు భయపడకమ్మా, నేనున్నానుగా! నీవు వెళ్ళి పడుకో." ఆమె కళ్ళు తుడుచుకొంటూ వెళ్ళిపోయింది!

చినుకులు టపటపమని రాలసాగాయి. కుర్చీ లాక్కొని కాళ్ళు కిటికీలో పెట్టుకొని చేరగిలబడి కూర్చున్నాను, తను గాఢంగా నిద్ర పోతున్నాడు.

కళ్ళ ముందు గది బయట వాన. కళ్ళవెనక జ్ఞాపకాల వాన. ఆ వానలో తడిసిపోతూన్న హోటల్. హోటల్లో వెనక గదిలో నేనూ, సంజీవరావూ,

హోటల్ బయట వాన. లొడలొడమని నీటిగొట్టాల శబ్దం. దీపాలు ఆరిపోయిన పట్టణం. గాలి విసిరినప్పుడల్లా లోపలికి చొరబడుతున్న జల్లులు. భోజనం ముగించుకొని కౌంటర్ దగ్గిరికి వచ్చాము. వాన వెలిసే సూచనలు లేవు. తను బయటికి తొంగిచూశాడు.

హోటల్ భవనపు షెడ్కింద ఒదిగి ఒదిగి నిలబడుతున్నాయి మూడు మానవాకారాలు. రెండు పెద్దవి. ఒకటి చిన్నది.

కౌంటర్ టేబిల్పై పెట్టుకొన్న కొవ్వొత్తి వెలుగు కొద్దిగా వాకిలిపై పడుతూంది. ఆ వెలుగులోకి కదిలి ఒక ఆకారం నమస్కారం చెబుతున్నట్లు వంగి లేచింది.

"మీ రిక్కడే ఉన్నారా?" ఉలిక్కిపడి ఒకడుగు వెనక్కువేసి, "పోయారేమో అనుకున్నాను. వానలో ఎందుకు తడుస్తున్నారు? లోపలికి రండి" అన్నాడు. భయానికి సున్నితమైన చిత్రమైన అనుభూతి కంఠంలో ప్రతిధ్వనించింది. తటపటాయిస్తూ ఆ ముగ్గురూ లోనికి వచ్చారు.

వెంటనే లైట్లు వెలిగాయి. గదినిండా వెలుగు. వెలుగులో వాళ్ళు ముగ్గురూ...వికృతంగా ఉబ్బిపోయిన ముఖాలు చేప పొలుసుల్లా పొట్లు రేగి నూనె కారుతున్నాయి ముడుచుకుపోతూన్న చెవులు. చీకిరించుకొని చూస్తూన్న కళ్ళు. కృశించుకుపోయిన చప్పిడి ముక్కులు. లావుగా పొట్టిగా ముడుచుకుపోతూన్న వేళ్ళు. రాలిపోతున్న మొండిచేతులు తెల్ల డబ్బాలు పట్టుకున్నాయి. అవి అమెరికావాళ్ళు సరఫరాచేసే పాలపొడి డబ్బాలు. డబ్బాలకు మూతలు తొలగించడంవల్ల పట్టుకోటానికి వీలుగా తీగెలు వంచిఉన్నాయి. భయంకరమైన కుష్టు రోగంతో బాధపడుతున్న ఒక మగ, ఒక ఆడ. ఒక పిల్లవాడు. భయంభయంగా లోనికి వచ్చి గోడ పక్కగా కూర్చున్నాడు. ఒళ్ళు జలదరించింది.

"మిమ్మలను ఆడుకోనివ్వకుండా చెడగొట్టి ఉంటుంది వాన. ఇంతలో వెలిసేట్టులేదు." రెండు పంట్లాంజేబులోకి చేతులుపోనిచ్చాడు తను. నిటారుగా నిలబడి దీర్ఘంగా గాలి పీల్చుకొని యజమానికేసి తిరిగి "ఏమనుకోకు. పాపం వానలో తడిసిపోతున్నారు...అందరూ వెళ్ళగొడితే ఎక్కడికని వెళతారు.? కొద్దిగా పుణ్యం చేసుకో" అన్నాడు చిరునవ్వుతో. తన అంగీకారాన్ని చిరునవ్వుతో వ్యక్తపరచాడు అతను,

"వీళ్ళకు మూడు భోజనాలు తెమ్మని చెప్పు. నేను బిల్లు చెల్లిస్తాను" లైట్లు మళ్ళీ పోయాయి. బయట వాన హోరు. సప్లయర్ ఒకడు కొవ్వొత్తులు వెలిగించి బల్లలపై పెట్టాడు. మే మిద్దరమూ ఒక బల్లపై చేరాము. మా ఇద్దరిమధ్య కొవ్వొత్తి తగలబడిపోతూంది. బొట్లు బొట్లుగా దాని కన్నీటి బిందువులు రాలి పడుతున్నాయి. ఈదురుగాలికి రెపరెపలాడుతూంది ప్రాణం పోతున్నప్పుడు మనిషి విలవిలలాడినట్లు. దానికేసి తదేకంగా చూస్తున్నాయి అతని కళ్ళు. నేను చూపు పక్కకు తిప్పుకొన్నాను.

సప్లయర్ ఒకడు వాళ్ళను సమీపించాడు. అతనిని చూసి డబ్బాలు ముందుకు జరిపారు. అతను ముక్కుకు గుడ్డ అడ్డం పెట్టుకొని ఒక్కొక్క డబ్బాలో మంచినీళ్ళు. సాంబారు పోశాడు. వారు ముగ్గురూ మధ్య పరుచుకొన్న గుడ్డపై విస్తళ్ళలో అన్నం ఎత్తి పడవేశాడు.

ఆవురావురుమంటూ అన్నానికి ముఖం వాచినట్లు తినసాగారు.

"సంజీవరావూ. చూడరా !" వాళ్ళను చూపాను.

"ఒరేయ్...ఈలాంటి నిష్ప్రయోజకులు బ్రతుకులో ఏ ఆశతో ఏ ఆనందంకోసం జీవిసారో తెలియదు. చూడు. ఎంత అసహ్యంగా అర చేతులతో అన్నం నోట్లో కుక్కుకుంటున్నారో...వాళ్ళ బ్రతుకు వాళ్ళకే భారం. నోటికి ఆహారం అందించలేని మొండిచేతులు. శరీరాన్ని మోయలేని కాళ్ళు, రసికారే రణాలతో. ముసురుకొనే ఈగలతో, తలవాల్చుకొనే స్థలంలేక ఆ పంచకూ, ఆ పంచకూ పరుగెత్తుతూంటారు...వీళ్ళు ఇంక తమంతట విషం తాగి ఎందుకు చనిపోరో తెలియదు." తల రెండు చేతుల్లోకి తీసుకొని బల్లమీదకు వంగుతూ అన్నాడు.

"నీలాటివాళ్ళే అలా మాట్లాడితే ఇక దయచూపేవాళ్ళు ఎవరురా ?"

తల పైకెత్తాడు. కళ్ళు జ్వలిస్తున్నాయి కొవ్వొత్తిలా: "అది దయ కాదురా !...బలహీనత అనుకొంటాను. ఈ బహీనత ఉన్నవాడే జాలిపడి ఒక పైసా ఇస్తూంటాడు. వాళ్ళపట్ల నిజమైన దయ చూపేది మరణం. మృత్యువు వాళ్ళకు ఆ భయంకర వ్యాధినుండి శాశ్వతముక్తి కలిగిస్తుంది. కాబట్టి వాళ్ళకు చావుద్వారా ఎవరు విముక్తి కలిగిస్తారో వాళ్ళు నిజమైన దయాశీలురు. అది నిజమైన దయ." ఆవేశం కనిపించింది మాటల్లో. కొవ్వొత్తి కరిగిపోతూంది.

దయతో కరిగిపోతూన్న అతని హృదయంలో కన్నీళ్ళు పాషాణంలా గడ్డ కట్టుకుపోతున్నాయి.

"అది ఎంత క్రూరమైన విషయం !"

"అవును ... దయ కొన్నిసార్లు క్రూరంగానే ఉంటుంది. నిశ్చితమైన అభిప్రాయం కళ్ళల్లో కనిపించింది.

అతను మాట్లాడుతున్న ధోరణికి నా శరీరం కంపించింది. కొవ్వొత్తి రెపరెప కొట్టుకొని ఆరిపోయి పొగ రాసాగింది. బయట వాన కురుస్తూనే ఉంది.

వెనకగావచ్చి నా భుజం తట్టింది ఒక చెయ్యి మృదువుగా. జ్ఞాపకాల వలలో తగులుకొన్న మనస్సును ఊడదీసి వెనుతిరిగి చూశాను. డాక్టర్.

సగం గీచుకొన్న పిల్లిగడ్డంతో, గోధుమ రంగు పంట్లాంతో, వెయిస్ట్‌కోటులో, ఆరడుగుల ఎత్తున నిలబడి ఉన్నాడు డాక్టర్. అతని వెనుక ఇద్దరు అనుచరులు.

"ఇక్కడ ఉండకూడదు."

"అవును...వాన వెలిశాక." బయటికి చూపాను.

కుండపోతగా వాన కురుస్తూంది. మెరుపులు చీలుస్తూన్న ఆకాశం

మళ్ళీ అతుక్కుపోతూంది. చెట్లు చీకటిలో శివం పూని ఊగుతున్నాయి. పెళపెళమని విరుకుపడింది ఆ మూల.

మంచంమీదనుండి త్రుళ్ళి పడ్డాడు తను.

వాన ... కిటికీ బయట వాన ... వాన.

వెర్రిచూపులు చూసుకొంటూ భయంకరంగా కేకలు పెట్టాడు ... "పట్టుకోండి...వాళ్ళు నామీదికి వస్తున్నారు ... పట్టుకోండి." మంచం దిగి పరిగెత్తసాగాడు.

"పట్టుకోండి." డాక్టర్ అరిచాడు పిచ్చివాడిలా,

అనుచరులు వెనకగా వెళ్ళి అతని భుజాలు పట్టుకొన్నారు. పట్టు విడిపించుకోటానికి పెనుగులాడి క్రూరంగా మొరటుగా తోసుకుంటూ మంచంపై పడవేసి కాళ్ళూ చేతులూ కట్టివేశారు.

"వాళ్ళు ... పోయారులే." అనునయంగా పలుకుతూ డాక్టరు ముక్కువద్ద దూది వాసన చూపెట్టాడు. వెంటనే కళ్ళు మూతలు పడి పోయాయి. ఎత్తుగా ఛాతి ఉబ్బి, దిగిపో నారంభించింది. డాక్టర్ అతని శరీరంలోకి పొడుగాటి సూది దయతో కసిగా గుచ్చాడు. రోగి పెదవుల నుండి సన్నని మూలుగు వినిపించింది.

డాక్టర్ అనుచరులు వెళ్ళిపోయారు.

కుర్చీలో కూలబడింది శరీరం వాకిటికి దగ్గరగా. మూసుకొన్నాయి కనురెప్పలు.

బయట వాన ... జ్ఞాపకాల వాన ...

గీకిన పుండులా సూర్యుడు మండుతున్నాడు, కళ్ళ ముందు.